క్లుప్తంగా

పీవీటీజీల ఇళ్ల మంజూరుకు సర్వే

జి.మాడుగుల: బలహీన గిరిజన(పీవీటీజీ) కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపర్చటానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి–జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం–జన్మన్) ద్వారా కొత్త ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తుందని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. ఇక్కడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ పీఎం జన్మన్ ద్వారా ప్రతీ పీవీటీజీ కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.2.3 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. మండలంలో 25 పీవీటీజీ గ్రామాలను ఎంపిక చేశామన్నారు. పీవీటీజీ కుటుంబాలకు ఆధార్, కుల ధ్రువీకరణ, జనధన్ ఖాతాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ పథకం కింద ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రతీ పీవీటీజీ నివాసాన్ని సందర్శించి లబ్ధిదారులను గుర్తించటానికి ఒక సర్వే నిర్వహించాలన్నారు. ఆ సమయంలో ఆయా కుటుంబాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పథకం గురించి మరింత సమాచారం కోసం గ్రామ సచివాలయాలను, మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

గంగవరం: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలో నూతనంగా మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కన్వీనర్ డాక్టర్ నిడమర్తి చిన్నబాబు తెలిపారు. శనివారం నెల్లిపూడిలో గంగవరం మండల కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ మండలాధ్యక్షుడిగా మునగాడ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా నిడమర్తి రమేష్ కుమార్, కార్యదర్శిగా ఈదుల సత్యనారాయణ, ఉప కార్యదర్శిగా అయినవిల్లి నానిబాబు, కోశాధికారిగా గంజేట్టి మోహన్, మీడియా మండల కోఆర్డినేటర్ మసురుపాం భానుమూర్తి, గౌరవాధ్యక్షుడిగా మునగాడ సోమరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు గద్దం అనిల్, గోకవరం సెక్రటరీ దేవరపల్లి వీరబాబు పాల్గొన్నారు.

రీసర్వేతోనే రైతుల భూములకు భద్రత



పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ హరి, నాయకులు

దుంబ్రిగుడ: రీసర్వేతోనే రైతుల భూములకు మరింత భద్రత కలుగుతుందని సర్పంచ్ హరి తెలిపారు. శనివారం కండ్రుం పంచాయతీ పరిధి ఒంబి, దొరగుడ గ్రామాల్లో 55 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రీసర్వే ద్వారా రైతుల భూములకు భద్రత కల్పించిందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు పాంగి శోభన్ బాబు, దాసుబాబు, గ్రామ వలంటీర్లు శ్రీను, కొములు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం



రిగ్‌బోరు తవ్విస్తున్న సర్పంచ్

రాజవొమ్మంగి: దూసరపాము గ్రామ శివారులో రైతాంగానికి, అటవీ పనులకు వెళ్లే వారు కోసం సర్పంచ్ చీడి శివ శనివారం మంచినీటి బోరు తవ్వించారు. ఈ ప్రాంతంలో తాగునీరు లభించక, ఈ పరిసరాల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల అభీష్టం మేరకు ఈ ప్రాంతంలో బోరు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచ్ సహృదయానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరంజ్యోతి, ముసలయ్య, రాంబాబు, త్రిమూర్తులు, రమణ, రాయుడు, అర్జునుడు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



హుకుంపేట: తడిగిరిలో షటిల్ ఆడుతున్న యువత



చింతపల్లి రూరల్: గొందిపాకలులో పోటీలను ప్రారంభిస్తున్న కార్యదర్శి పూర్ణచంద్రరావు

చింతపల్లి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గొందిపాకలు సచివాలయ పరిధిలో ఆటల పోటీలను కార్యదర్శి పూర్ణచంద్రరావు ప్రారంభించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని 26 గ్రామ సచివాలయాల్లో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో,



ఎటపాక: బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

కబడ్డీ, తదితర ఆటలతో గ్రామాల్లో పండగా వాతావరణం నెలకొంది. తడిగిరి పంచాయతీలో రెండ్రోజులుగా షటిల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు.

క్రీడా ప్రతిభ వెలుగులోకి

ఎటపాక: ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమం ద్వారా గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం గుండాలలో సెయింట్ ఆన్స్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కాఫీ రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు చిన్నబాబు



మాట్లాడుతున్న కాఫీ రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు చిన్నబాబు

అరకులోయ రూరల్: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కాఫీ రైతు సంఘం జాతీయ అధ్యక్షుడు చిన్నబాబు కోరారు. శనివారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో కాఫీ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించిన కాఫీకి సక్రమంగా ధర లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 2019–22 వరకు రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సాహక నిధులు రూ.60 కోట్ల వరకు బకాయి ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో 1.40 లక్షల మంది రైతులు కాఫీ పంటపై ఆధారపడి ఉన్నారన్నారు. 11 మండలాల పరిధిలో ఏడాదికి 15 వేల మెట్రిక్ టన్నులు కాఫీ దిగుబడి అవుతుందన్నారు. ప్రభుత్వం సరైన ధర ప్రకటించకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో అరకు కాఫీకి ఎంతో డిమాండ్ ఉందన్నారు. రైతులకు మార్కెట్ ధర కల్పించకపోవడం అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయకపోవడంతో నాంది, మాక్స్, వంటి ప్రైవేటు సంస్థలు నిలువుదోపిడీ చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వం తక్షణమే కిలో కాఫీ రూ.వెయ్యికి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాలదేవ్, గురుమూర్తి, రైతులు సుబ్బారావు, రామన్న, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు నందిని



ఎంపికైన నందినితో హెచ్‌ఎం వరప్రసాద్, పీడీ గోవిందరావు, ఉపాధ్యాయులు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మద్దు నందిని జాతీయస్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ గోవిందరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 15న పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన నందిని జాతీయస్థాయికి ఎంపికైనట్టు తెలిపారు. ఆమె జనవరి 4,5,6 తేదీల్లో రాజస్థాన్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా నందినితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ గోవింద్‌ను హెచ్‌ఎం వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

మారుమూల గిరిజన గ్రామాల్లో రెడ్‌క్రాస్ సేవలు

దుప్పట్లు, దోమతెరలు, హైజనిక్ కిట్లు పంపిణీ



గిరిజనులకు దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

పాడేరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సిబ్బంది మారుమూల గిరిజన గ్రామాల్లో దుప్పట్లు, దోమతెరలు, హైజనిక్ కిట్లు పంపిణీ చేశారు. కించూరు గ్రామంలో 80 కుటుంబాలకు, పెదబయలు మండలం మారుమూల కుంతుర్ల పంచాయతీ బర్రెమామిడి, రాసగుప్ప, బైతిలంక గ్రామాల్లో 220 కుటుంబాలకు వీటిని అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పల్టాసింగి సూర్యారావు, లోహితాస్, చిన్నిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

రంపచోడవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రంపచోడవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండల కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసేవారిని నియమిస్తూ అధిష్టానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

మండలం	అధ్యక్షుడు	ఉపాధ్యక్షులు
అడ్డతీగల	మద్దాల వీర్రాజు	అలివేలు దొంగబాబు, కురసం చిన్నలుదొర
చింతూరు	వై. రామలింగారెడ్డి	డి. వెంకటేశ్వర్లు, తుర్రం రామయ్య
దేవీపట్నం	గారపాటి మురళీకృష్ణ	కర్రి అబ్బాయిరెడ్డి, కొమరం బాలకృష్ణ
గంగవరం	అమిర్తి అప్పాలరాజు	గండేపల్లి అర్జునరావు, కోటికలపూడి కొండలరావు
కూనవరం	ఏ కోటేశ్వరరావు	ఏ మరియదాసు, జి. బాబు
మారేడుమిల్లి	సత్తి సత్యనారాయణరెడ్డి	సార్ల లింగారెడ్డి, కుండ్ల ప్రభాకర్‌రెడ్డి
రాజవొమ్మంగి	సింగిరెడ్డి రామకృష్ణ	ఎం ముసలయ్య, కనిగిరి దుర్గాప్రసాద్
రంపచోడవరం	జల్లేపల్లి రామన్నదొర	పండా జగ్గారావు, కారం పోతురాజు
వీఆర్ పురం	మడిరెడ్డి సత్యనారాయణ	చిక్కాల బాలకృష్ణ, మడి ముత్యాలరావు
వై రామవరం	మామిడి అప్పారావు	పల్లాల రామనమ్మ, డి గంగరాజు
ఎటపాక	తానికొండ శ్రీనివాసరావు	ఆకుల వెంకటరామారావు, చిలుకూరి నాగయ్య

ఇంటి వద్దే న్యూ ఇయర్ వేడుక

సీఐ రుద్రశేఖర్ సూచన



సీఐ రుద్రశేఖర్




సీఐ రామారావు

అరకులోయ టౌన్: న్యూ ఇయర్ వేడుక ఇంటి వద్దే జరుపుకోవాలని సీఐ సిహెచ్.రుద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ రాత్రి మద్యం తాగి రోడ్డుపై ఎవరైనా రేస్ డ్రైవింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అరకులోయకు విచ్చేసే పర్యాటకులకు పోలీస్ శాఖ తరపున న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఒక రోజు సరదా కోసం జీవితాలను నాశనం చేసుకోకుండా పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎటపాక: న్యూ ఇయర్ వేడుకల సాకుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ డి. రామారావు హెచ్చరించారు. ఈ నెల 31వ తేదీ ఒంటి గంట సమయం వరకు మాత్రమే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవన్నారు. రహదారులపై సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి వేడుకలు జరుపుకునే వారు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. రాత్రి సమయంలో ప్రతీ గ్రామంలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు.

లచ్చిగూడెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చింతూరు: తుమ్మల గ్రామ పంచాయతీ లచ్చిగూడెంలో శనివారం వికసిత్ భారత సంకల్పయాత్ర విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా బీజేపీ మండల కన్వీనర్ డీవీఎస్ఎస్ రమణారెడ్డి మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు రోజుకు రెండు గ్రామ పంచాయతీల చొప్పున మండలంలో యాత్ర నిర్వహించామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో వివరించామన్నారు. ఉజ్వల యోజనతో మండలంలో ప్రతి ఒక్కరికి గ్యాస్ లబ్ధి చేకూరుందన్నారు. ప్రతి గిరిజన లబ్ధిదారుడికి సొంత ఇల్లు కట్టుకోవడానికి రూ.2.3 లక్షలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్ పురం మండలాధ్యక్షుడు ముత్యాల రాంబాబు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రటరీ పంబి భూపేష్, జిల్లా శాఖ కిసాన్ మోర్చా నాయకులు సోడి రమేష్, నోముల సత్యనారాయణ పాల్గొన్నారు.

చదువుతోపాటు సృజనాత్మకత తప్పనిసరి

సమత సంస్థ డైరెక్టరు సుశాంత్ పాణిగ్రాహి



అవగాహన కల్పిస్తున్న సమత సంస్థ డైరెక్టరు సుశాంత్ పాణిగ్రాహి

పాడేరు : విద్యార్థులకు చదువుతో పాటు సృజనాత్మకమైన ఆలోచలలు ఎంతో అవసరమని సమత సంస్థ డైరెక్టర్ సుశాంత్ పాణిగ్రాహి తెలిపారు. సమత యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నైపుణ్యాభివృద్ధి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజు, రోజుకు పెరిగిపోతున్న పోటీతత్వానికి అణుగుణంగా సమర్థవంతమైన వృత్తి నైపుణ్యం ఎంతో అవసరమన్నారు. ప్రాథమిక విద్యా నుంచే సాఫ్ట్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలన్నారు. పబ్లిక్ స్పీకింగ్, గ్రూపు చర్చల్లో పాల్గొని విశ్లేషణ చేయడం, స్పష్టత అలవర్చుకోవడం, ఇన్నోవేషన్, విశ్లేషణాత్మక ఆలోచన, నేర్చుకున్న విషయాన్ని పరిశోధన కోణంలో ఆలోచన చేయడం, ప్రాధాన్యత, అనుకూలతల్లో తేడాలు తెలుసుకోవడం వంటిని నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ బి. హరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌గా సంతృప్తికర సేవలు



ఐటీడీఏ పీవో అభిషేక్‌ను సన్మానిస్తున్న సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, అధికారులు

- పాడేరులో బైపాస్ నిర్మాణానికి కృషి
- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: గిరిజన ప్రాంతంలో సేవలందించడం ప్రతి ఉద్యోగి అదృష్టంగా భావించాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ అన్నారు. మూడు రోజుల క్రితమే పాడేరు సబ్ కలెక్టర్‌గా ధాత్రిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇన్నాళ్లు సబ్ కలెక్టర్‌గా వ్యవహరించిన ఆయన విధులు నుంచి రిలీవ్ అయ్యారు. ఈ మేరకు ఐటీడీఏ పీవో వి. అభిషేక్‌ను శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ తన హయాంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పాడేరులో బైపాస్ రోడ్డు మంజూరుకు కృషి చేశానన్నారు. ఏజెన్సీలో కమ్యూనికేషన్ వ్యవస్థకు మెరుగుపర్చేందుకు సెల్‌టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ చేశానన్నారు. ఏడు డీఎల్‌సీలు నిర్వహించి 50వేల ఎకరాలకు ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందరి సహకారంతో తాను విజయవంతంగా విధులు నిర్వహించానని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 11 మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాగికి మద్దతు ధర



ఆర్బీకేలో రాగులు కొనుగోలు చేస్తున్న ఏవో, సచివాలయం సిబ్బంది

- కిలో రూ.38.46తో కొనుగోలు
- 5 కేంద్రాల ఏర్పాటు

పెదబయలు: ప్రభుత్వం రాగికి మద్దతు ధరతో రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండలంలోని పది గ్రామ సచివాలయాలకు సంబంధించి అడుగులపుట్టు ఆర్బీకే రాగి కొనుగోలు కేంద్రంలో అమ్మకం చేయాలి. ప్రభుత్వం కిలో రాగికి రూ. 38.46తో క్వింటాళ్లకు రూ.3,846 మద్దతు ధరలో కొనుగోలు చేస్తోంది. రైతులు రాగి నూర్పుల తర్వాత కొనుగోలు కేంద్రంలో అమ్మాలనుకుంటే గ్రామ సచివాలయం అగ్రికల్చర్ సహాయకులకు సంప్రదిస్తే పౌర సరఫరాల శాఖ నుంచి గన్నిబ్యాగ్స్ ఉచితంగా ఇస్తారు. కొనుగోలు కేంద్రంలో ఇచ్చిన నాలుగు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలో జమ కానుంది. మండలంలోని అడుగులపుట్టు, కిముడుపల్లి, పెదకోడాపల్లి, గంపరాయి, అరడకోట రైతు భరోసా కేంద్రాల్లో రాగులు కొనుగోలు చేస్తున్నామని ఏవో ఏ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రైతులు రాగులు కిలో కూడా బయట మార్కెట్‌కు అమ్మడానికి వీలు లేదన్నారు. ప్రైవేటు వర్తకులు తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారని, వారికి అమ్మి మోసపోవద్దన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలతో ప్రత్యేకంగా రాగులు కొనుగోలు చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని రికార్డు ధర అందిస్తున్నామని తెలిపారు.

12 క్వింటాళ్లు అమ్మాను



గంపరాయి రైతు భరోసా కేంద్రంలో 12 క్వింటాళ్ల రాగులు అమ్మా.. వీటి కోసం గన్నిబ్యాగ్స్ ఇచ్చారు. రూ.38.46 పైసాల మద్దతు ధరతో కలిపి రూ.46,152 నా బ్యాంకు ఖాతాలో నాలుగు రోజుల్లో జమ అయ్యింది. గతంలో ఎన్నడూ ఇంత మద్దతు ధర రాలేదు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మాకు మంచి ఆదాయం చేకూరింది. గతంలో వారపు సంతల్లో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధర చెల్లించేవారు. తూనికల్లో మోసం ఉండేది. ఇప్పుడు ఆర్బీకే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. గ్రాము కూడా నష్టం వాటిల్లకుండా తూకం ఉంటోంది. అలాగే సాగు వేసినప్పటి నుంచి సలహాలు సూచనలు అందిస్తున్నారు.

– వంతాల నానరావు, రైతు, చీడిపుట్టు గ్రామం, గంపరాయి సచివాలయం

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అలాగే స్వామివారికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది.1001 నామాలతో స్వామికి అర్చన చేశారు.

యోగానంద నారసింహుడిగా అప్పన్న



సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది



యోగానంద నారసింహ అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు శనివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహుడి అలంకరణలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకీలో వేంచేయజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి విశేషంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఇంద్రప్రస్థం నాటకానికి బంగారు నంది

మునగపాక : విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇంద్రప్రస్థం నాటకం ప్రదర్శితమై బంగారు నందిని కైవసం చేసుకుంది. దీంతో స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులతో ఈ నెల 17న మునగపాకలో ఇంద్రప్రస్థం నాటకం ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. నటీ నటులంతా అద్భుతంగా నటించడంతో పాటు సమాజానికి దోహదపడే సందేశాన్ని అందించారు. ప్రేక్షకుల ఆదరాభిమానాలు అందుకున్న ఈ నాటకం విజయవాడలో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో పాల్గొని బంగారు నందిని దక్కించుకుంది.

'జగన్ సైన్యం..' పాట ఆవిష్కరణ



జగన్ సైన్యం పాటను ఆవిష్కరిస్తున్న రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

నర్సీపట్నం : అభివృద్ధి, సంక్షేమంపై ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ రూపొందించిన పాటను వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల కాలంలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ఎమ్మెల్యే గణేష్ జగన్ సైన్యం..పాటను చిత్రీకరించారు. సామాజిక సాధికార యాత్రకు విచ్చేసిన వై.వి.సుబ్బారెడ్డి ఈ పాటను ఆవిష్కరించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఈ పాట ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా పార్టీ కార్యదర్శి బొడ్డు గోవిందరావు, డాక్టర్ లక్ష్మీకాంత్, చింతకాయల వరుణ్, ఏఎంసీ భాస్కర్ నాయుడు, సినీ నిర్మాత కర్రి రాంగోపాల్, పార్టీ మహిళా విభాగం ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత పాల్గొన్నారు.